క్లుప్తంగా

అద్భుతం.. అపురూపం



రావి ఆకుపై చెక్కిన ఈశ్వరుని రూపం



పెంకే కృష్ణ స్వామి

గండేపల్లి: పరమశివుని రూపాన్ని ఆకుపై చెక్కి తన భక్తిని చాటుకున్నాడు దర్శా రామానికి చెందిన పెంకే కృష్ణ స్వామి. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కృష్ణస్వామి బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ముక్కంటి రూపాన్ని రావిఆకులో తీర్చిదిద్ది ప్రశంసలు పొందాడు. ఆకులో ఈశ్వరుని రూపాన్ని తీర్చి దిద్దేందుకు సుమారు గంట సమయం పట్టినట్టు తెలిపారు. కాగా ఆయన ఇప్పటికే పలు దేవతామూర్తుల రూపాలతో పాటు దేశ నాయకుల చిత్రపటాలను గీసి అందరిమన్ననలు పొందారు.

ఆక్రమణదారులకు నోటీసులు



జగ్గంపేటలో దుకాణం వద్ద నోటీసులు అతికిస్తున్న హైవే అధికారులు

జగ్గంపేట: జాతీయ రహదారిపై జగ్గంపేట బ్రిడ్జి శివారు జేవీఆర్ సెంటర్‌కు ఇరువైపులా రహదారిని ఆక్రమించుకున్న పలువురికి హైవే అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. యజమానులు అందుబాటులో లేని షాపులు వద్ద దుకాణాలకు నోటీసులు అతికించారు.హైవే స్థలం ఎక్కడ వరకూ ఉందో అక్కడ వరకూ ఖాళీ చేయాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రత్తిపాడు: కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు బుధవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని టి.రాయవరం గ్రామానికి చెందిన బత్తుల చినపాప (52) ఐదేళ్లుగా సుగర్ వ్యాధితో బాధపడుతోంది. ఆమె భర్త సూర్యనారాయణ ఆమెకు సపర్యలు చేస్తున్నాడు. ఇదిలా ఉండగా గత నెల 11న భర్త మంచినీళ్లు తెచ్చేందుకు బయటకు వెళ్లగా ఆమె చలిమంట వద్దకు వెళ్లింది. చీరకు నిప్పు అంటుకుని శరీరం కాలింది. ఓ ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్ వద్ద చికిత్స పొందుతున్నప్పటికీ గాయం తగ్గకపోవడంతో ఈ నెల 19న స్థానిక సీహెచ్‌సీలో చేరారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గోవిందుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధితుడికి ఆక్సిజన్ మెషీన్ అందజేత



జె.కొత్తూరులో బాధితుడికి ఆక్సిజన్ మెషీన్ అందజేస్తున్న యూత్ సభ్యులు

జగ్గంపేట: మండలంలో జె.కొత్తూరు గ్రామానికి చెందిన తలారి రాజు ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. అతనికి నిత్యం ఆక్సిజన్ పెట్టుకునేందుకు ఆక్సిజన్ మెషీన్ అవసరం. దీనిని గుర్తించిన జగ్గంపేటకు చెందిన హెల్పింగ్ హార్ట్ యూత్ సభ్యులు రూ.1.75 లక్షల విలువ చేసే ఆక్సిజన్ మెషీన్‌ను అందజేశారు. యూత్ నాయకులు చిన్నారి, శ్రీనుబాబు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



పంచామృత కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరునక్షత్రం శ్రవణం సందర్భంగా పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో 108 కలశాల పంచామృతాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవారికి, పరివార దేవతలకు అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు అభిషేకించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వేళంగిలో మల్లికార్జునస్వామిని దర్శించుకున్న ముద్రగడ గిరిబాబుతో వైఎస్సార్ సీపీ నాయకులు



తుని పట్టణంలో శివలింగంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



రాజపూడిలో శివలింగానికి అభిషేకం చేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం, యువనేత తోట రాంజీ



శంఖవరం మండలంలో జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

హరహర మహాదేవ

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- ఏలేరు నదిలో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు



ఏలేశ్వరంలోని ఏలేరు నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: హరహర మహాదేవ..శంభోశంకర అంటూ శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయంలో అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పుణ్యస్నానాలకు బారులు

ఏలేశ్వరంలోని ఏలేరు నదిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శివాలయం నుంచి ఏలేరు నది వరకు రహదారి భక్తులతో కిటకిటలాడింది. ఏలేరు నది సమీపంలోని బ్రాహ్మణ రేవు, శ్మశానవాటిక వద్ద ఉన్న శివుని విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంతో పాటు సమీపంలోని సత్యనారాయణస్వామి ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రసాదం విక్రయించారు. పట్టణంలో పలు సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు. స్థానిక నర్సీపట్నం రోడ్డులో వైఎస్సార్ సీపీ నేత మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద ఇంటి వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నదానంలో పాల్గొని వడ్డన చేశారు. అలాగే పార్టీ నేత సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. పార్టీ నాయకులు పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, పతివాడ జగదీష్, అవరాల నాగరాజు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వినాయకుని గుడి వద్ద భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గావెంకట ప్రసాద్, కటకం కిరీటీ, తూముశెట్టు గురయ్య, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తుని: నియోజకవర్గంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. భక్తులు తెల్లవారుజామున నది, సముద్ర స్నానాలు ఆచరించి భోళాశంకరుడిని దర్శించుకున్నారు. గవరపేట, పెద్దవీధి, గాంధీసత్రం, కత్రాళ్లకొండ శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక దివాణంవీధిలోని బ్రహ్మకుమారీస్ భవనంలో పుష్పలింగం ఏర్పాటు చేశారు. భక్తులు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. మహాశివరాత్రి ప్రాముఖ్యతను బ్రహ్మకుమారీ బీకే మాధవి లత వివరించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, యనమల కృష్ణుడు, కుసుమంచి శోభారాణి, దాడిశెట్టి విష్ణుచక్రం, సూర్యనారాయణరాజు, మల్లిబాబు, రామచంద్రరావు, భగవాన్, గిరి, సుబ్బహ్మణ్యం, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి పంచాయతన క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్తిపాడు-లంపకలోవ రహదారిలోని పుష్కర కాలువలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

మహాశివలింగం ఏర్పాటు

మహా శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణాలయంలో బ్రహ్మకుమారీ తులసి ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీలు మహా శివలింగాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్తిపాడు, పరిసర గ్రామాల ప్రజలతో పాటు బ్రహ్మకుమారీలు, రాజయోగ శిక్షకులు మహా శివలింగాన్ని దర్శించుకున్నారు.

గండేపల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, యల్లమిల్లి, నీలాద్రిరావుపేట గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు తిలకించి ప్రసాదాలు స్వీకరించారు.

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శంకరణం గోవింద రాజుశర్మ, శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొండంగి రామలింగేశ్వరాలయం, అద్దరిపేట, పైడికొండ, శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి, బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం గ్రామాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని దానవాయిపేట, పెరుమాళ్లపురం, ఎల్లయ్యపేట, జీ.ఎం.పేట, కొత్తపోడిపల్లిపేట, వాకదారిపేట, తాటియాకులపాలెం తదితర తీరప్రాంతాల్లో ప్రజలు సముద్రస్నానాలు ఆచరించారు.

శంఖవరం: మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. గిరిజన ప్రాంతమైన వేళంగి లొద్దులో ఉండే ధార క్షేత్రంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ధారమల్లికార్జున స్వామికి పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. వేళంగిలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ గిరిబాబు మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాలు శ్రీను, సర్పంచ్‌లు మేకల సత్యనారాయణ, చెంచుబాబు, రామిశెట్టి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని శృంగవరం-మెరక చామవరం సమీపంలోని నందనవనంలో వేంచేసిన నాగలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత ఆలయప్రాంగణంలోని కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులకు అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. రౌతులపూడిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తుని రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ఉపవాసాలతో ఆలయాలకు చేరుకుని అభిషేకాలు, పూజలు చేశారు. తేటగుంట, హంసవరం, టి.తిమ్మాపురం, చామవరం, జగన్నాథగిరి, తదితర గ్రామాల ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.

కిర్లంపూడి: మండలంలోని భూపాలపట్నం, పాలెం, సోమవరం, కృష్ణవరం, వేలంక గ్రామాల్లోని శివాలయాలు బుధవారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. తామరాడలో వేంచేసిన దాసాంజనేయ స్వామి గుడి వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సర్పంచ్ తోట అయ్యన్న, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగ్గంపేట: మండలంలోని జగ్గంపేట, రాజపూడి, ఇర్రిపాక గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఇర్రిపాకలోని ఏలేరు నదిలో భక్తులు తెల్లవారుజాము నుంచి పుణ్యస్నానాలు ఆచరించి శివకేశవులు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. రాజపూడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా తీసుకువచ్చిన పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. రాజపూడిలో వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శివకేశవులు, ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



దానవాయిపేట సముద్రతీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



రాజపూడిలో పవిత్ర జలాలతో ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ప్రత్తిపాడులో విశేష అలంకరణలో విశ్వేశ్వరస్వామి



నందనవనంలో ప్రత్యేక అలంకరణలో నాగలింగేశ్వరస్వామి

రత్నగిరిపై బఫే పద్ధతిలో అన్నదానం

అన్నవరం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్థానిక వీరవేంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానపథకంలో బుధవారం నుంచి బఫే పద్ధతిలో భక్తులకు భోజనాలు పెట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు అన్నదాన పథకం హాలులో మాత్రమే భక్తులకు భోజనాలు పెట్టేవారు. కాగా శని, ఆదివారాలు, పర్వదినాల్లో భక్తులు భోజనం కోసం గంటల తరబడి వేచియుండాల్సి వస్తోంది. అన్నదాన పథకంలో ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు భోజనాలు పెడుతున్నారు. ఒక ట్రిప్పుకు 400 మంది చొప్పున రోజుకు సుమారు నాలుగు వేలు నుంచి ఐదు వేల మందికి భోజనం పెడుతున్నారు. ఒకసారి భోజనానికి కూర్చున్నవారు భోజనం ముగించి లేవడానికి పావుగంట, తరువాత క్లీనింగ్‌కు మరో పావుగంట పడుతుంది. దీంతో అన్నదానం క్యూలో భక్తులు సుమారు గంటకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది.

కలెక్టర్ ఆదేశాలతో...

గత సోమవారం రత్నగిరిపై తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నదాన పథకంలోని క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులను చూసి చలించిపోయారు. ఆ తరువాత జరిగిన సమీక్షలో అన్నదాన పథకంలో ఏకకాలంలో ఎక్కువ మందికి భోజనం పెట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో అన్నదానం హాలు పైఅంతస్తులో వికలాంగులు, వృద్ధులకు విడిగా భోజనాలు పెడుతున్న హాలులోనే బఫే పద్ధతిలోనూ భోజనాలు ప్రారంభించారు. కాగా పర్వదినాలు, భక్తుల రద్దీ సమయంలో బఫే పద్ధతిలో భోజనాలు పెడతామని అధికారులు తెలిపారు.



రత్నగిరిపై బఫే పద్ధతిలో భోజనాలు చేస్తున్న భక్తులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

తుని: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ ప్రసాద్ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. తుని నియోజకవర్గంలో 6505 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. తునిలో 5, కోటనందూరు, తొండంగిలో రెండు చొప్పున 9 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద సీసీ కెమెరాలు , టెంట్లు, రక్షిత మంచినీరు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పోలీసులు తెలిపారు.

శంఖవరం: పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ తాతారావు తెలిపారు. తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 876 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగుతుందన్నారు.

కిర్లంపూడి: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను బుధవారం తహసీల్దార్ జె. చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నట్టు ఎస్సై. జి.సతీష్ తెలిపారు.

తుని రూరల్: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలు వరకు పోలింగ్ జరగనుంది. కాగా బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకే ఎన్నికల నిర్వహణ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. తుని మండల పరిషత్, తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయాలతో పాటు బ్యాంకు కాలనీ సచివాలయం, అమ్మాజీపేటలో జెడ్పీ గెస్ట్ హౌస్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



తునిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు



శంఖవరంలో ఓటర్ల లిస్ట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సరస్వతీ నమస్తుభ్యం..!

- రత్నగిరిపై సరస్వతీ పూజ
- విద్యార్థులకు కలాలు, కంకణాల పంపిణీ



రత్నగిరి పై సరస్వతీ పూజ నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణీ...విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా అంటూ విద్యార్థులు ఆలపించిన సరస్వతీ ప్రార్థనతో సత్యదేవుని ఆలయం మార్మోగింది. ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ బుధవారం ఉదయం రత్నగిరిపై సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు. తొలుత పండితులు సత్యదేవుడు, అమ్మవార్లకు, సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతీదేవి వద్ద కలాలు, కంకణాలు ఉంచి పూజలు చేశారు. సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు విద్యార్థులకు కలాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధరబట్ల గంగబాబు, యనమంద్ర శర్మ, ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కంచిబట్ల సాయిరామ్, నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏటా ఆలస్యంగా సరస్వతీపూజ

రత్నగిరిపై ఏటా సరస్వతీ పూజ వసంత పంచమి లేదా మాఘమాసం రెండో వారంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది కూడా మాఘ శుద్ధ త్రయోదశి రోజు సరస్వతీ పూజ నిర్వహించారు. కాగా ఈసారి ఎన్నడూలేని విధంగా మహాశివరాత్రి నాడు సరస్వతీ పూజ నిర్వహించారు. దీంతో తక్కువగానే విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో పెన్నులు స్పాన్సర్ చేసిన శ్రీప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులే అధికంగా ఉండడం విశేషం. వచ్చే ఏడాదైనా వసంత పంచమి లేదా భీష్మ ఏకాదశి అనంతరం సరస్వతీ పూజ నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

జలపాతాలకు పోటెత్తిన భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం మండలంలో ధారపల్లి, యరకంపాలెం, తోటపల్లి అటవీప్రాంతాల్లోని జలపాతాలకు భక్తులు పోటెత్తారు. జలపాతాల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు. యరకంపాలెంలో పండితుడు లక్ష్మణస్వామి, ధారపల్లిలో స్వామిరామరాజు, చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాచపల్లిలోని అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో స్వామిరామానంద ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. యరకంపాలెం, గజ్జనపూడి గ్రామాల్లో రాత్రంతా జాగారం నిర్వహించారు. ధారపల్లి, యరకంపాలెం, తోటపల్లి జలపాతాల భక్తుల సౌకర్యార్థం అన్నదానం నిర్వహించారు.



యరకంపాలెం జలపాతం వద్ద భక్తుల సందడి

ధారపల్లి జలపాతం వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

